
# ఎస్.ఐ. నవ్వేడు

## — తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి

ఎ.ఎస్.పి.కొత్తగా నాటిన మొక్కలు అతనిలాగే వున్నాయి కళకళ్లాడుతూ. ఉదయపు ఎండలో పచ్చగా మెరుస్తున్నాయి. పాదుల్లో చల్లటి తడి ఇంకా ఎండలేదు.

ఎ.ఎస్.పి. ఉదయమే స్వహస్తాలతో చెట్లకు నీళ్లు పోస్తాడు. లేవగానే వెండి చువ్వలాటి తెల్లటి శరీరాన్ని లక్ష రకాలుగా క్షోభపెట్టి, మెలికలు తిరిగి, ఆసనాలు వేసి, చెమట ఆరగానే చెట్లకి నీళ్లు పోస్తాడు. స్నానం కాగానే మఠం వేసుకుని పది నిముషాలు ధ్యానంలో కూచుంటాడు. అతన్నా స్థితిలో మొదటిసారి చూసిన వీరయ్యకి వెంటనే రిటైరయి పోవాలనిపించింది.



అనిల్ తెలుగువాడు కాదు. ఆ(గా. ఎ.ఎస్.పి.గా ఇక్కడి కొచ్చి రెండు నెలలైంది. ఈ రెండు నెలల్నుంచీ బంగళాలో పోలీసులు ఇంకా తేరుకోలేదు. నిజానికి అనిల్ బంగళాలోకి మొదటిసారి అడుగుపెడుతూండగా ఎటెన్షన్‌లో నిలబడి శాల్యూట్‌లో బిగిసిన జవాన్లకి కింద నేల పెద్ద గుంటపడి కూరుకుపోయి నట్టనిపించింది. అనిల్ చిరునవ్వు నవ్వేడు.' తల సున్నితంగా పంకించి "గుడ్‌మార్నింగ్"అని కూడా అన్నాడు. మధ్యాహ్నం కానిస్టేబుల్ వీరయ్య తేల్చి చెప్పేడు.

"దొరగారు అలా నవుతావుంటే పోర్సులో లూజైపోద్ది"

ఈ రెండు నెలల్లో వీరయ్య ఖాయిలా పడ్డానికి ఎంత జరగాలో అంతా జరిగింది. జవాన్లు కాఫీ అందించినా, ఏష్(టే అందించినా అనిల్ 'థేంక్స్' అంటున్నాడు. దీంతో బంగ్లాలో పోలీసులకి ఏదో వెలితీ, ఓ రకమైన బెంగా ఆవరించాయి. ఎ.ఎస్.పి. మీద (కమంగా జాలితో కూడిన అభిమానం లాటిది ఏర్పడింది. పుట్టుకతోనే పోలియో కాళ్లతో చచ్చుపడిన పిల్లాడి పట్ల కలిగే జాలీ, అభిమానానికీ దీనికీ ఆట్టే తేడా లేదు. నగరంలో వున్న మూడు స్టేషన్లలో దొరగారికి "మెతకోడు' ' అని పేరొచ్చేసింది. కానీ ఆ మూడు స్టేషన్లకీ, దొరగారి బంగ్లా జవాన్లకీ తెలియనివీ, వాళ్లు పీడకలల్లో కూడా వూహించనివీ ఘోరమైన అభి(ప్రాయాలూ, ఆదర్శాలూ వున్నాయి అనిల్‌కి. కింది అధికారులకి అప్పుడప్పుడూ దొరగారి 'అపోలీసు' తత్త్వం కనిపిస్తూండేది.

అనిల్‌కి ఐ.పి.ఎస్. అంటే వ్యామోహం. స్కాట్లండ్ యార్డ్ అంటే (పేమ. (బిటిష్ బాబీ (పోలీసులు) లంటే గౌరవం. ఆఖరికి అతను పోలీసులంటే (పజలు ఇష్టపడాలనీ, (పజలకి సహాయం చెయ్యడమే పోలీసుల పరమార్థం అని కూడా అనుకుంటాడు. (బిటిష్ పోలీస్‌లా కర్టియస్‌గా వుండాలనీ, సమర్థంగా వుండాలనే అభి(పాయం కూడా లేకపోలేదు. యూనివర్సిటీలో వుండగా 'Inspector West' చదివేడేమో అనిల్ బాధ్యతాయుతమైన, సంస్కారవంతులైన పోలీసు అధికార్లు ఈ దేశానికి అవసరం అన్న నిర్ణయానికి వచ్చేశాడు. పైగా భాష మీది (పేమ వల్ల అతను చక్కటి ఇంగ్లీషు కూడా మాట్లాడతాడు. ("ఆడెవరో ఇందీ ఏక్ట్రిల్లా వుంటా దొరే.")

అనిల్ నాతి గల బ్రహ్మచారి. భార్యా, కూతురూ ఆగ్రాలో వున్నారు. ఈ ఏడాదికి వాళ్లిద్దరూ అక్కడే వుండాలని. రాత్రి ఆగ్రా నుంచి ఫోనొచ్చింది. ఇద్దరూ ఓ పది రోజుల్లో బయలుదేరి రావడానికి నిశ్చయించుకున్నారు. ("షీ ఈజ్ టెరిబ్లీ మిస్సింగ్ యూ. అనిల్") పాప తండ్రి మీద బెంగెట్టుక్కూచుంది. సరే నన్నాడు ఎ.ఎస్.పి. దొరగారు. ("సునీయే ఎడ్మిషన్‌కి బారే మేఁ సోచియే") సీటు ఏ స్కూల్లో దొరుకుతుందో చూసి వివరంగా 'లిఖాఊంగా' అన్నాడు.

కాఫీ తాగి ఫైలు దగ్గిరకు లాక్కుని ఆలోచనలో పడ్డాడు అనిల్. జవాను వినయంగా సిగరెట్ పెట్టె, చిల్లరా టేబిలు మీద పెట్టేడు. 'థేంక్స్' అన్నాడు ఎ.ఎస్.పి. జవాను హృదయం కుంగి మ్లానవదనంతో బయటికి వెళ్లిపోయాడు. సిగరెట్టు వెలిగించి రెండు దమ్ములు లాగి ఫోను దగ్గిరకు లాక్కుని సి.ఐ. గారికి రింగ్ చేశాడు.

"హా (ఇంగ్లీషులో) గుడ్‌మార్నింగ్ ఇన్‌స్పెక్టర్". ఒళ్లంతా చెవులతో సి.ఐ.గారు అవతల వింటున్నారు. రెండు నిముషాల ఇంగ్లీషూ, హిందీ తర్వాత చెప్పేడాయన. ఆయనకి హిందీ రావడం వల్ల పరాయిభాష బాధ తప్పింది. ఊళ్లో సెయింట్ మేరీస్ మంచి స్కూలు. జిల్లాలోవే మంచి స్కూలని చెప్పారు. ఫోను పెట్టేసి సిగరెట్ ఏష్‌ట్రేలో కుక్కి పొగవదుల్తూ లేచేడు అనిల్. ఓ జేబులో చెయ్యి పెట్టుకుని చకచక బయటికి నడిచాడు.

కిటికీలోంచి పోలీసు జీప్‌నీ, నీలం టీ షర్టులో దిగుతున్న ఎ.ఎస్.పి.నీ చూశాడు ఫాదర్ జార్జి. అతనూ, స్కూలు ప్రిన్సిపాలూ దీర్ఘంగా మళయాళంలో, మధ్యలో దట్టమైన ఇంగ్లీషులో పరీక్షల గురించి చర్చించుకుంటున్నారు. సెయింట్



## ఉపోద్ఘాతం



ఈ భూమ్మీద ఎప్పుడో ఒక విస్ఫోటనం జరగనే జరిగింది.
దానికెవరూ బాధ్యులు కారు, నేనే.
అనుభవాల కమురు వాసనల్ని భరించని ఏదో తనం
ఈ ప్రపంచం నిండా పరుచుకుంది.
కిటికీ రెక్కలు వూడిపోయాయి.
ఇప్పుడు ప్రపంచానికీ నాకూ మధ్య దూరాల్లేవు.
గదిలోకి సముద్రం ప్రవహించింది.
ఈ సముద్రం మీద హాయిగా నిద్రపోయాను

ఎవరూ లేని ఈ రాత్రిలో పాము బుస.
కాలికింద మెదడును కదిలించే రబ్బరు ముక్కలాంటి శవం
కలవరింతలు భయంకర రహస్యాల్ని వొలుస్తుంటాయి.
చర్మం మీద వెంట్రుకలు భయంగా వీధుల్లోకి చూస్తుంటాయి.
వీధులకు మనిషంటే కసి
వీధులు దివిటీల్లా ఎర్రెర్రగా మండుతుంటాయి.
ఎప్పటికీ పెగలదు పూడుకుపోయిన గొంతు.
ఇప్పుడు మనిషిలో మాటల్లేవు.
మాటలన్నీ ఇప్పుడు రూపం కోల్పోయాయి.

కళ్ళల్లో ఇంద్రధనుస్సులు రెమ్మలు రెమ్మలుగా విస్తరిస్తున్నాయి.
వందలుగా ఉదయాలు భూమ్మీదికి పాత రక్తంతో కాలు మోపుతున్నాయి.
అయినా మనిషి ముందు సంవత్సరాలు తగలబడిపోతున్నాయి.

వెనక్కీ ముందుకీ పరుగులు పెట్టే వంతెనల మీద
జీవితమంతా రాలిపోతుంది.
దీనికెవరూ సాక్షుల్లేరు నేను తప్ప.

ఎవరి మౌనమూ ఈ జడత్వాన్ని కరిగించదు
ఎవరి పిలుపూ చలనం కలిగించదు
ఈ దారులూ వేరే ఉలికిపడే సంఘటనలూ వేరే.
ఏ విస్ఫోటనమూ జరగకుండానే
ఇక్కడ రక్తం కాల్వలై ప్రవహించింది.
ఏ సంతకమూ లేకుండానే ఈ భూమ్మీద
శకలాలు శకలాలుగా ప్రపంచం రాలిపోయింది.
ఏ మాపూ తగలకుండానే మనిషి మాడి మసైపోయాడు.

సమాధులు పూలను ధరించి పలకరిస్తున్నాయి
వీధులు ఊపిరి పోసుకుని మళ్ళీ నడుస్తున్నాయి.
రాత్రులు పగళ్ళకోసం పడి గాపులు కాస్తున్నాయి.
కాని, మనిషి మాత్రం ఏ సంతకమూ చేయకుండానే
ఇక్కడ్నుంచి తప్పుకున్నాడు
ఇప్పుడు ఈ భూమ్మీద కొత్త విస్ఫోటనం జరగాలి.
దానికింద సంతకం మాత్రం
నాది నీదీ మనందరిదీనూ...

— యాకూబ్

మేరీస్ మంచి చదువులకీ, పక్కా క్రమశిక్షణకీ, ఖచ్చితమైన పరీక్ష Time table . కీ ప్రసిద్ధి. అక్కడ సీటు రావడం, ఊళ్లో నీటి సరఫరా సక్రమంగా జరగడం అసంభవమనే నిర్ణయానికి ప్రజలు ఎన్నడో వచ్చేశారు. అనిల్ లోపలికి రాగానే ఫాదర్ జార్జి తెల్లగా నవ్వుతూ బలంగా చెయ్యి నొక్కి కుర్చీ చూపించాడు. ఫాదర్‌కి వలభై అయిదు నుంచి ఏభయి అయిదు వరకూ ఎంతేనా వయసు వుండే అవకాశం వుంది. తెల్లటి పొడుగు కోటులో నల్లగా ఆరోగ్యంగా, నొక్కుల జుట్టుతో వుంటాడతను. ముగ్గురూ టీ తాగ్గానే స్కూలంతా చూపించాడు ఫాదర్. "బ్యూటిఫుల్" అన్నాడు అనిల్. మళ్లీ ఇద్దరూ ఫాదర్ ఆఫీసులో కూచున్నారు. అనిల్ విషయం చెప్పగానే జార్జికి కాసేపు నోట మాట రాలేదు. ఏం చెయ్యాలో తోచక ఎ.ఎస్.పి.ని రెండు క్లాసులకి తీసుకెళ్లి చూపించాడు. ఒకళ్ల కొకరు అతుక్కుపోయి కూచున్నారు పిల్లలు. ఆ క్లాసుల్లో కూచోడానికి కూడా వీల్లేని కిరసనాయిలు రద్దీ ఏర్పడింది. పది నిముషాల తర్వాత పాపకి సీటు ఇవ్వలేదన్న ఆనందంతో జీపు ఎక్కాడు అనిల్. పోలీసు హోదాని కూడా తిరస్కరించి సీటు లేదనడం అతనికి గొప్ప ఆనందాన్ని కలిగించింది. ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి గురించి ఫాదర్ చెప్పిన మాటలు అనిల్‌కి నచ్చేయి. గుమ్మం వరకూ వచ్చి, రెండు నెలల్లో ఒకటి రెండు సీట్లు ఖాళీ అయే అవకాశం వుందనీ, స్వయంగా తనే ఫోన్ చేస్తాననీ క్షమాపణలు చెప్పేడు ఫాదర్. ("Oh! Don't worry Father!")

మధ్యాహ్నానికి స్కూలు గురించి మర్చిపోయేడు అనిల్. నాలుగు దాటుతూండగా జవాను మెత్తగా లోపలికి వచ్చాడు.

"టూ టౌన్ ఎస్.ఐ. వెంకట్రావు గారు సార్" అన్నాడు.

ఎస్.ఐ. వెంకట్రావు శెల్యూట్ కొట్టి కుర్చీలో కొంచెంగా కుచించుకు కూచున్నాడు.

"How are you Mister Rao"

"తేంక్యూ సార్. I bring "piles" sar." అని ఫైలు చేతికందించాడు. సిగరెట్ వెలిగించి పెట్టె రావు ముందుకి తోశాడు అనిల్. 'వద్దుసార్' అంటూ పెట్టెని ఎఎస్‌పి తల్లిగారి చెయ్యి పట్టుకున్నట్టు గౌరవంగా ఎత్తి సున్నితంగా దొరగారి ముందు పెట్టేడు. ఫైలు తెరిచాడు అనిల్.

"మీకేం ఇబ్బంది లేకుండా బావుందా సార్" అన్నాడు రావు. అంటే ఇంగ్లీషులో అతను వాడిన పదాలకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ అర్థం రాకపోయినా మనసులో మాట మాత్రం అదే.


"Oh yes. fine. Thankyou." అని ఊరుకోలేదు. యథాలాపంగా కూతురి సీటు గురించీ, స్కూలు గురించీ చెప్పేడు అనిల్.

"Iam proud of that school." ఎస్.ఐ. వెంకట్రావు జరిగిన ఘోరానికి విస్తుపోవడానికీ, నిర్విణ్ణుడూ మొదలైనవి అవడానికి ప్రయత్నించాడు. చివరికి ఎంతో బాధగా అన్నాడు.

"సీట్ నాట్ గెటింగా సార్?"

మొత్తానికి మరో అరగంట అధికారిక విషయాలు మాట్లాడి వెళ్లబోతూ రావు చెప్పాడు. ఆ స్కూలువాళ్లకీ, తనకీ వున్న ఆత్మీయ సంబంధంవల్ల దొరగారి అమ్మాయికి సీటు సంపాదించే బాధ్యత స్వీకరించాడు. ప్రత్యేకమైన ఆనందంతో శాల్యూట్ కొట్టి బయటికి నడిచాడు రావు. అతనికి యూనిఫాం పిగిలిపోయేటంత ఆనందంగా వుంది.

వీరయ్యని ఇవతలికి పిలిచి అన్నాడు-




"దొరగారికి సెయింటు మేరీసోళ్ల సీట్లేదన్నారంట. మనం ఇప్పింతాం చూడు."

అన్నాడుగానీ స్టేషనుకెళ్లి కూచున్న గంటవరకూ అతనికేవీ పాలుపోలేదు. కరీంని పిలిచాడు రావు.

"వెళ్లి ఆరుగంట్లకి రమనోపాలి రమ్మను"

కరీం తలూపుతూనే రావువేపు చూసి కనుబొమలెగరేశాడు.

"ఛీ. ఏలా పాలా లేదే్ఁటా ఎదవకొడకా. ఏరే పనుంది లాక్కురా."

'ఎస్.ఐ ఎంకట్రావు' ప్రస్తుత పదవిలోకి కింది నుంచి నింపాదిగా పైకి వచ్చినవాడు. దొరగార్ని ఎప్పుడు ఎలా సేవించుకోవాలో తెలిసినవాడు. సెయింట్ మేరీస్లో సీటు రాదని తెలిసినవాడు. చీకటి పడుతూండగా ఎర్ర చీరలో రిక్షా దిగింది రమ. కిళ్లీ ఉమ్మేసి లోపలికి నడిచింది.

రోజూలాగే రెండ్రోజుల తరవాత సూర్యోదయం అయింది. కానీ ఆ రోజు ఉదయం అనిల్ చాలా సంతోషంగా లేచి చెట్లకి ఎక్కువ నీళ్లు పోసి రెండు బస్కీలు ఎక్కువ తీశాడు. "కుర్లి సత్తాయి గూడాను" అనుకున్నాడు వీరయ్య. ఆఫీసులో కూచుని భార్యకి పెద్ద ఉత్తరం రాశాడు. పాపకి సీటు దొరికింది. ఎప్పుడు రావాలంటే అప్పుడు రావొచ్చు. స్కూలు నుంచి నిన్న సాయంకాలం ఫోనొచ్చింది. అనుకోకుండా సీటు ఖాళీ అయిందన్నాడు ఫాదర్ జార్జి.

"I am very grateful to you father"

కానీ ఫాదర్ కంఠంలో అంత ఉత్సాహం, సంతోషం ధ్వనించినట్టు లేదు. అనిల్‌కి ఆశ్చర్యం కలగకపోలేదు. ఎస్.ఐ.కి వున్న పరిచయం కారణం అయి వుంటుందనుకున్నాడు.

ఫోను పెట్టేసి నీరసంగా లేచి కారిడార్లోంచి మెట్లు దిగి ఆయన కాటేజికి బయలుదేరేడు జార్జి. తెల్ల పొడుగు కోటులో ఆరోగ్యంగా లేడు ఫాదర్. పూడ్చిపెట్టిన నెల తరవాత లేచి వచ్చినట్టున్నాడు. తెల్లకోటులో నల్లశవంలా వున్నాడు. కాటేజి వెనక సూర్యాస్తమయం అయింది. ఫాదర్ జార్జి స్నానం చేసి ప్రార్థన చేసుకోడానికి కూచున్నాడు. బయట చీకట్లు పరుచుకుంటున్నాయి. ఫాదర్ గుండెలో, బయటకంటే చిక్కగా బైబిల్ కంటే నల్లగా జిట చీకటినిండిపోయింది. ఏం జరిగిందో ఎలా జరిగిందో అర్థం కావడంలేదతనికి. నిన్న అతన్ని రక్షించే శక్తి ఏదీ కనిపించలేదు. ఇలాగే ప్రార్థించాడు. మేరీ ముందు మోకరిల్లేడు. అతనికి తెలియదుగానీ తెలిసుంటే ఆ క్షణంలో మరిడమ్మ, తలుపులమ్మ, గండిపోచమ్మ, బాపనమ్మ వగైరా దేవతలందరి ముందూ పడ్డానికి సిద్ధంగా వున్నాడు. ముక్కూ, మొహం చూడని తన మీద ఆమెకెందుకింత పగ? తనేం పాపం చేశాడు?

ముందురోజు ఉదయం ఆఫీసులో పని చూసుకుంటున్నాడు ఫాదర్. తన కోసం ఎవరో స్త్రీ బయట నుంచుని వుంది. కాగితాలు పక్కన పెట్టి లోపలికి రమ్మని సంజ్ఞ చేశాడు. చెమర్చే కళ్లతో ఆమె ఎదురుగా కూచుని, దణ్ణం పెడుతూ మధ్యలో కళ్లు తుడుచుకుంటూ అంది. ఆమెనీ, కూతుర్నీ వదిలేసి భర్త ఎటో పారిపోయాడు. తనకి దిక్కులేదు. కుట్టుపని చేసుకుంటూ పాపని చదివిస్తోంది.

"మంచి మార్కులొస్తాయి అయగారూ. చిన్న స్కూలండీ. చదువు సరింగా చెప్పరండి. మీరు కనికరించండి దొరగారూ. మీ ఇంట్లో పాచిపని చేసుకుంటాను. మీ స్కూల్లో సీటు ఇప్పించండి బాబూ."

ఫాదర్ బాధగా నిట్టూర్చేడు. ఆమెకి వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం చెయ్యగలనన్నాడు. సీటివ్వడం, పాచిపనికి పెట్టుకోవడం తప్ప ఏం చెయ్యడానికేనా సిద్ధమేనన్నాడు ఫాదర్. తనకి సీటే కావాలందామె. చివరికి తెలుగు మళయాళంలో ఏం లాభం లేదని చెప్పి లేచేడు జార్జి. కళ్లు ఒత్తుకుంటూ మళ్లీ వస్తానని నుంచుందామె. ఫాదర్ మళ్లీ గాఢంగా నిట్టూర్చేడు.

చెప్పినట్టుగానే మళ్లీ ప్రత్యక్షమైంది ఆమె. చీకటిపడ్డ తరవాత జార్జి కాటేజికి వచ్చిందామె. టీ తాగి మళ్లీ కళ్లనీళ్లు పెట్టుకుందామె. చటుక్కున జార్జి కాళ్ల మీద పడింది. ఆమెని బయటికి పంపించడానికి ఎప్పుడో అలెప్పీలో చచ్చిపోయిన జార్జి తాతగారు రావల్సొచ్చింది. ఎవరూ చూడకుండా బయటికి వచ్చి రిక్షా ఎక్కి టౌన్ స్టేషనికి వెళ్లిపోయిందామె.

మర్నాడుదయం ఫాదర్ జార్జికి ఫోనొచ్చింది.

"ఎస్.ఐ. ఎంకట్రావ్ స్పీకింగ్. నమస్కారం పాదర్. మీతో పనిబడింది."

"What can I do for you."

"చిన్న గొడవొచ్చింది. అది ఫోన్లో చెప్పేది కాదు. అంటే మీ గురించే బాధ పడతన్నాను. మన జిల్లాలో ప్రిస్టేజీ స్కూలు మీది. ... కాదులెండి నే ఒస్తన్నాగా. కొంచెం కాన్ఫిడెన్షల్‌గా మాటాడుకుందాం. ప్రెస్సోళ్లకి గొడవ దెలీకూడదు. మంొస్తన్నా పాదర్. నమస్కారం."

ఫాదర్ జార్జి ఫోనుపెట్టి తలపట్టుక్కూచున్నాడు. ఆయనకీ ప్రిన్సిపాలుకీ ఎంత ఆలోచించినా అంతుబట్టలేదు. కాసేపటికి మోటార్ సైకిల్ శబ్దం, కొన్ని క్షణాల తరవాత బూట్ల చప్పుడూ, గదిలోకి రాగానే చెమటా మట్టిల మిశ్రమ పరిమళం తోడుగా ఎస్.ఐ. లోపలికి వచ్చేడు. కుర్చీలో కూచుని, రుమాల్తో మొహం తుడుచుకుంటూ ఫాదర్ వేపు గంభీరంగా చూశాడు. అలాగే కప్పలా, మౌనంగా ఫాదర్ వేపు చూస్తూ వుండిపోయాడు.

"డ్యూటీ ప్రకారం అయితే ఇవాళ నేను స్కూలికి రాను. మిమ్మల్నే రప్పించేవోణ్ని. కానీ స్కూలు ప్రిస్టేజీ, పరువూ పోద్దని బాదపడి నేనే చొరవగా ఒచ్చేను" అని మళ్లీ నిశ్శబ్దపు కమ్మీ చిదిలించాడు ఎస్.ఐ. జార్జి కుర్చీలో మేకు దిగినట్టు కదిలేడు. ప్రిన్సిపాలు ఫాదర్ మొహం వేపు చూసింది. తీక్షణంగా ఇద్దర్నీ చూస్తూ జేబులోంచి కాయితం తీసి అందించాడు రావు. ఫాదర్ మడత విప్పి అతికష్టం మీద తెలుగు ఉత్తరాన్ని చదువుకున్నాడు. ఆఖరి వాక్యం పూర్తి అవకముందే ఆయన కళ్లు బైర్లు కమ్మేయి. ఆయన

తరవాత కాయితం చదివిన ప్రిన్సిపాలు కుర్చీలో మూర్ఛపోయింది.

"అదీ మరి. ఇప్పుడూ, పాదరైనా ఉప్పూ కారం తినేఓడే గదా ఏదో జేసే వుంటాడనుకుంటారు జనం... దాని జాకెట్టు చింపి చీర లాగేరంట గదా. రాసిందయన్నీ. చదివేరుగా."

"This is horrible. I never molested a woman"

"మీరు మానబంగం జెయ్యడానికి ప్రయత్నించారని కంప్లయింటండి. సాయంకాలం సీటు గురించి వచ్చిందట. గదిలోకి ఈడిసి కెళ్ళేరంట. ఆ మిగతా పోగ్రాం రాసిందిగా."

ఫాదర్ జార్జి పిడికిలి బిగించాడు. అతని నవనాడులూ కుంగిపోయాయి. సీటుకోసం ఒకామె వచ్చిన మాట నిజవేననీ, తనే పాపం ఎరగననీ, భగవంతుడే సాక్ష్యం అన్నాడు జార్జి.

"బలే వోరండీ. రేప్ కేసుల్లో బగవంతుడు సాక్షం చెప్తాడేటండీ. జరగాల్సిన పని జూడండి. దాని కంప్లయింట్ చూడగానే మీ గురించి బాద పడి ఇలా వచ్చేను. ఇది నిజవా అబద్దవా అలా వుంచండి. ప్రెస్సోళ్ళు కుక్కలా వాసన బడతారు. నే నీడకి రావడం, ఈ మనిషి నాకు రాసియ్యడం, మా వోళ్లందరికీ తెల్సు. ఏ ఎదవో వాగేడనుకో, పత్రికల్లో మీ పేరూ, అత్యాచారం గుడ్డా గూసూ అన్నొస్తాయి."

"But I am innocnt, I never saw that bloody woman before"

(నేనేవీ ఎరగను. ఆ ముండని ఎప్పుడూ చూడలేదని మామూలు తెలుగు)

"ప్చ్, ఏటో. మీరు దాన్ని ఏం జేశారని అడుగుతున్నానా? మీరు చెయ్యలేదంటారు. అదేమో చేశారంటోంది. అమ్మా, అయగారికి మీరేనా జెప్పండి. ఈ రోజుల్లో ఏ ఎదవకి నిజం గావాలి! రేపు పేపర్లో పడుద్ది. స్కూలు పరువేవవుద్ది. పిల్లల అమ్మాబాబులు ఊరుకుంటారా? ముందు స్కూలు మీదా తరువాత మీ మీదా పేన్నీళ్ల జల్లుతారా లేదా? ముందు పేపర్లో పాదరు మానబంగం జేశాడని పడుద్ది. తరవాత అబద్దం అని ఏసేవోడెవడు?"

ప్రిన్సిపాలు ముఖం పాలిపోయింది. రెండోసారి మూర్ఛ పోవడానికి సిద్ధంగా వుంది. జార్జి పేపరు వెయిటు తినడానికి సిద్ధంగా వున్నాడు.

"సరే మీ ఇష్టం. ఆ కాయితం ఇవ్వండి. రేపు స్టేషనికొచ్చి కనిపించండి. పదిదాటనివ్వకండి. తరవాత నేనే పి.సి.ని పంపింతాను. ఏటంటే, స్కూల్లో పిల్లల ముందు మిమ్మల్ని జీపెక్కించడం బాగోదని. అదీ. పరువు బోయిం తరువాత బతికి సుకవేవుందీ? వస్తానమ్మా. అయగార్ని లాకప్పులో ఎయ్యాలంటే నాకూ బాదగానే వుంది. జామీనిస్తే ఒదిలేత్తావనుకోండి."

ఇద్దరూకలిసి ఎస్.ఐ.ని కూచోపెట్టారు. ప్రిన్సిపాలు కళ్ల ముందు పేరెంట్సు అందరూ పెద్ద పెద్ద కుండలతో హోలీ లాగ పేడనీళ్ల ఆమె మీదా ఫాదర్ మీదా చల్లడం దృశ్యాత్మకంగా కనిపించింది. గంట సేపు ఉండిపోయాడు రావు. ఈ గంటలో జార్జి మేరీ మీదా, జీసస్ మీదా ప్రమాణాలుచేసి మానభంగం చేసే అలవాటు లేదని మొత్తుకున్నాడు. చివరి పది నిముషాల్లో మూడు నిముషాలు ప్రిన్సిపాలు మళయాళంలో కళ్లనీళ్లు పెట్టుకుంది. జార్జి కళ్ల


దీపావళి శుభాకాంక్షలతో

ఫోన్స్ (ఫ్యాక్టరీ) - 324, 262

టెలెక్స్ - 0473 — 294

# శ్రీ పేపర్స్ లిమిటెడ్

**(Joint Venture of APIDC)**

సామర్లకోట - 533 440, తూర్పు గోదావరి జిల్లా (ఆం.ప్ర.)

పోస్టు బ్యాగ్ నెం. 6

ఫోన్: రాజమండ్రి 75977 (నివాసము)

ఉత్పత్తిదారులు :

గ్రే బోర్డ్సు, డూప్లెక్స్ బోర్డ్సు మరియు ఫైల్ బోర్డ్సు

# ఆశాహోన్ని!





నేనొక అర్థంకాని అడవిని
చీకటి చెట్లతో ఆటలాడుకునే అర్ధరాత్రిని
అనంతాకాశంలోని అకలి క్షేత్రాలన్నింటినీ
ఆక్రమించుకోవాలని ఆత్రుతపడుతున్న అజ్ఞాన నేత్రాన్ని.

అలంకారప్రియంగా
నగరాల చుట్టూ అల్లుకుంటున్న
స్వప్నవీథాల మీదుగా
గిరికీలు కొడుతున్న విప్లవ విహంగాన్ని
మాయావృతమైన రంగుల ప్రపంచంలో
ముఖాల పరువు దుప్పటీ కలల ఉయ్యాలకోసం
ఉన్మాదిలా బొర్లాపడుతున్న మధ్య వయసు బాలుణ్ణి
కళ్ళ సందుల్లోంచి నిస్పృహాయుత నిప్పులు కక్కుతున్నా
నిమ్నకత్తిలా విజృంభిస్తున్న మానవాస్థిపంజరాన్ని.

కాంతి వక్షోజాలపై చీకటి నఖక్షతాల్ని
ముద్రించి వస్తున్నా నిప్పుడే-
సముద్రం తెరలు తెరలుగా
ఉబికిస్తున్న నురగల్నించి
సన్నని దారాలు తీస్తూ
నా ప్రకృతి ప్రేయసికి ధగధగల
కాంతి వస్త్రాన్ని నేస్తున్నా నీక్షణమే.

ఆమె ఒక్క వీక్షణం
నాలో విలక్షణ సవ్వడుల్ని పలికిస్తోంది
నా తనువులోంచి ఒక విద్యుత్కాంతి
అమృత తుల్యంగా విశ్వమంతా వ్యాపిస్తోంది

ఆరని మంటల కొసలపై మానవాత్మల విహ్వాల నృత్యం
నాలో వినూత్న అంతరంగాన్ని ఆవిష్కరిస్తోంది
పట్టపగలు స్వప్నమే
నా పాలిటి పొదరిల్లై భాసిస్తోంది

నేనొక అర్థంకాని అర్ధరాత్రి అడవిని
చీకటి చెట్లతో ఆటలాడుకుంటున్న చందమామని
నా పుట్టుకెంత మహోద్భుత చిత్రమో
నా మరణమూ అంతటి అస్పష్టమనోహర చిత్రమే!

— డాక్టర్ సుమనశ్రీ

తుడుచుకున్నాడు. చివరి నిమిషంలో ప్రిన్సిపాలూ ఫాదరూ వ్యక్తిగత హోదాల్లో విడివిడిగానూ, సమిష్టిగానూ ఎస్.ఐ. కాళ్ల మీద పడ్డారు. పోలీసు కళ్యాణ నిధికి ముందు అయిదు వేలు రావు ద్వారా విరాళం ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డారు. అయితే "మనకి ప్రిస్టేజీ ముఖ్యం గానీ ఎదవ డబ్బుగా"దని ప్రకటించాడు రావు. చివరికి ఎస్.ఐ. వెళ్ళడానికి లేచి నుంచున్నాడు. జార్జి లేచి రెండు చేతులూ పట్టుకున్నాడు. పెద్దగా నిట్టూర్చి అన్నాడు రావు.

"ఈ కేసు అషప్ జెయ్యడం నేజూసుకుంటా లెండి. ప్రెస్సోళ్ల గొడవ గూడా నేనే పడతాను. తప్పుద్దా. నేనే నచ్చ జెప్పుకుని, కాదూ గూడదూ అంటే దానికాళ్లట్టుకుని కాయితం ఎనక్కి దీసుకోమంటాను. అదీ."

"I am most grateful to you Sir"

"అబ్బే. దానికేవుంది లెండి. మీలాటి పెద్దల్ని కాసుకోవాలి గదండీ. వస్తానండి. నవస్కారం."

"నమస్తే"

"అయ. అ... మరిచేపోయాను. నాదో చిన్న మనవండి"

"Please"

"అబ్బే ఏవుంటది లెండి. మా ఎ.ఎస్.పి. దొరగారు ఆళ్ళ పాపగారికి సీటు గురించి బాదపడతన్నారండి. దేవుడండి దొరగారు, మీ కేవయినా వీలవుద్దేమోనని"

గోల్ కీపర్‌లా ఎగిరి పడ్డాడు జార్జి. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు, సీట్లు లేవని జ్ఞాపకంవచ్చి. క్షణం నిశ్శబ్దం తరువాత ప్రిన్సిపాలు జార్జి వైపు చిరాగ్గా చూసి —

"Yes, certainly" అంది. ఫాదర్‌కి మళ్ళీ శ్వాస ఆడ్డం మొదలై అన్నాడు.

"Sure, Sure, Sure రేపే ఇస్తాను. నో ప్రాబ్లం."

"మర్చిపోరు గదండీ. పోనీ మీరే ఫోన్జేసి చెప్ప గూడదూ. అయగారు సంతోష పడతారు."

Sure, Sir, Sure"

"సరే... ఈ గొడవ గురించి మర్చిపోండి. నేజూసుకుంటా."

సాయంకాలం ఆరు గంటలకి అనిల్ టూటౌన్‌కి ఫోన్ చేశాడు. ఎస్.ఐ. ఫోనెత్తి దొరగారి గొంతువినగానే —

"గుడ్ మార్నింగ్ సార్"

పాపకి సీటు దొరికిందని చెప్పి అన్నాడు అనిల్.

"Thanks Inspector. But how did you manage it"

"నేనంటే వాళ్ళకి కొంచెం ఇదండి"

అని నవ్వేడు ఎస్.ఐ. ●